ములుగులో కురుస్తున్న వర్షం

అంబట్‌పల్లిలో విరిగి పడ్డ ట్రాన్స్‌ఫార్మర్

రెండు జిల్లాల్లో మోస్తరు వర్షం

ములుగురూరల్/వెంకటాపూర్/వాజేడు/వెంకటాపురం(నూగూరు)/గణపురం/ మహదేవపూర్/కృష్ణకాలనీ, సెప్టెంబర్ 20 : ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంతోపాటు వెంకటాపూర్, వాజేడు, వెంకటాపురం(నూగూరు), గణపురం, మహదేవపూర్ మండలాల వ్యాప్తంగా పలు గ్రామాల్లో శుక్రవారం వర్షం కురిసింది. ములుగు, వెంకటాపురం(నూగూరు) మండలంలో పిడుగుల తో కూడిన భారీ వర్షం రెండు గంటల పా టు పడటంతో జనజీవనం స్తంభించింది. ములుగు జిల్లా కేంద్రంలోని పలు భవనాలపై ఉన్న హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు విద్యు త్ తీగలపై పడ్డాయి. దీంతో గంటన్నర పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సిబ్బంది గంటపాటు శ్రమించి సరఫరాను పునరుద్ధరించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఉన్నట్టుండి ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. విద్యు త్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మహదేవపూర్ మండల పరిధిలోని అంబట్‌పల్లి గ్రామంలో ప్రాథమిక దవాఖాన సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ విరిగిపడింది. అధికారులు మరమ్మతు చర్యలు చేపట్టి విద్యుత్‌ను పునరుద్ధరించారు. కాగా పది రోజుల తరువాత వర్షం కురువడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

అటవీ నష్టంపై అధికారుల అంచనా సర్వే

ములుగు, సెప్టెంబర్20, (నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో ఆగస్టు 31వ తేదీన జరిగిన ప్రకృతి బీభత్సం కారణంగా జరిగిన అడవి నష్టాన్ని అటవీశాఖ అధికారులు సర్వే చేసి ఒక అంచనాకు వచ్చినట్లు తెలిసింది. భారీ వర్షానికి బలమైన గాలులు తోడు కావడంతో తాడ్వాయి మండలంతోపాటు ఏటూరునాగారం, గోవిందరావుపేట మండలాల్లోని పలు ప్రాంతాల్లో అడవులకు తీవ్ర నష్టం జరిగింది. అటవీశాఖ అధికారులు గత 15రోజుల నుంచి డ్రోన్ ఫొటోలను, వీడియోను విశ్లేషించి 335హెక్టార్లలో దాదాపు 86వేల చెట్లు కూలిపోవడం, విరిగిపోవడం జరిగిందని తేల్చారు. జరిగిన నష్టం విలువ సుమారు రూ.150 నుంచి రూ.155కోట్ల వరకు ఉంటుందని అటవీ శాఖ లెక్కల ప్రకారం నిర్ణయించారు. అధికారులు తొమ్మిది బృందాలుగా విడిపోయి కూలిపోయిన, విరిగిపోయిన ప్రతి చెట్టును కొలిచి నంబర్లు వేసి అటవికి వాటిల్లిన నష్టంపై పకడ్బందీగా సర్వే నిర్వహిస్తున్నారు. మరో రెండు రోజుల్లో సర్వేను పూర్తి చేసి పూర్తి వివరాలను ములుగు డీఎఫ్‌వో ద్వారా వెల్లడించనున్నట్లు అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు.

బాలిక మృతిపై వైద్య సిబ్బంది దర్యాప్తు


కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న సుమలత

ఏటూరునాగారం, సెప్టెంబర్ 20 : మండల కేంద్రంలోని ఆకులవారిఘనపూర్‌లో గీతిక అనే బాలిక మృతి చెందిన ఘటనపై వైద్యాధికారి, సిబ్బంది శుక్రవారం దర్యాప్తు చేశారు. మృతురాలి ఇంటిని సందర్శించారు. బాలిక తల్లిదండ్రులతో మాట్లాడారు. కుటుంబ సభ్యులు చూపించిన రిపోర్ట్స్ ఆధారంగా బాలిక మెదడువాపు వ్యాధితో మృతి చెందినట్లు గుర్తించామని వైద్యాధికారి సుమలత తెలిపారు. ఆకులవారి ఘనపూర్‌లో ఇంటింటా జ్వరాలు, దోమల లార్వాపై సర్వే నిర్వహించినట్లు చెప్పారు. ఇక్కడ 80ఇండ్లల్లో ఫైరిత్రం స్ప్రే చేశామన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. జ్వరాలు ఉన్నట్లయితే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో పారా మెడికల్ సిబ్బంది, మలేరియా సూపర్‌వైజర్ నర్సింహారావు పాల్గొన్నారు.

మానసిక స్థితులపై చర్యలు

కృష్ణకాలనీ, సెప్టెంబర్ 20 : జిల్లాలోని విద్యార్థులు, ప్రజల మానసిక పరిస్థితులపై తగిన చర్యలు తీసుకుంటున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ మధుసూదన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొందరు వివిధ కారణాలతో మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. వాటిని పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టెలి మానస్ సేవలు ప్రారంభించినట్లు చెప్పారు. ఉచిత టెలీ మానసిక ఆరోగ్య సేవ 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. టెలీ మానస్‌ను సంప్రదించినప్పుడు వారికి నచ్చిన భాషలో పలకరిస్తారని, శిక్షణ పొందిన మానసిక ఆరోగ్య నిపుణులతో కనెక్ట్ చేసి సమస్యలు వినేందుకు సిద్ధంగా ఉంటారన్నారు. ఈ నిపుణుల్లో మానసిక వైద్యులు, క్లినికల్ సైకాలజిస్టులు, మానసిక సామాజిక కార్యకర్తలు, వివిధ మానసిక ఆరోగ్య సమస్యలు పరిష్కరించడంలో ప్రావీణ్యం ఉన్న మానసిక నర్సులు ఉంటారన్నారు. హెల్ప్ లైన్ నంబర్ 14416 లేదా 1800891 4416కు కాల్ చేయవచ్చన్నారు. తీవ్రమైన ఆందోళనకు గురయ్యే విద్యార్థులు, ప్రజలు భూపాలపల్లి జనరల్ ఆస్పత్రిలో మానసిక వైద్యులను సంప్రదించి సేవలు పొందాలని సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331771-All-

PLOT FOR SALE

★హన్మకొండ KITS కాలేజీ, అంబాల రోడ్డుకు మరియు ముచ్చర్ల రోడ్డుకు కొత్తగా వస్తున్న హైవేకు దగ్గర్లో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 9553255936
NTW-326316

WANTED
★ We are Hiring PHARMACIST (B.Pharmacy/M.Pharmacy). Fresher/ Experienced, PCI Certificate Must.Receptionist with 1Year experience(Min)Anaesthesia Technician with 2 Year experience(Min) Send your Resume to koorapatiads@gmail.com for more information Cont: 7337222096.
NTW-000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

కృష్ణ కాలనీ, సెప్టెంబర్ 20 : వానకాలం ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీవోసీ కార్యాలయంలో వ్యవసాయ, పౌర సరఫరాలు, సహకార, గ్రామీణాభివృద్ధి శాఖ, తూనికలు, కొలతల శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024-25 వానకాలం ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం కావాలన్నారు. కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, తేమ సాంద్రత కొలిచే యంత్రాలు అందుబాటులో ఉండే లా చూడాలని ఆదేశించారు. ఈ ఏడాది 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని, అందులో 1.40 వేల మెట్రిక్ టన్నులు సన్నరకం, 60 వేల మెట్రిక్ టన్నులు ఉండనున్నట్లు చెప్పారు. గత ఏడాది 187 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఈ సంవత్సరం వ్యవసాయ శాఖ అధికారులు ఆయా మండలాల వారీగా ధాన్యం పండించిన రైతులు వివరాల నివేదిక అందించాలని ఆదేశించారు. దాని ఆధారంగా కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచాలని సూచించారు. ఎలక్ట్రానిక్ కాంటాలు ఉపయోగించాలని ధాన్యం తూకంలో అవకతవకలు జరగకుండా చూడాలని, తూనికలు, కొలతల శాఖ అధికారి తనిఖీలు నిర్వహించి సీల్స్ పరిశీలించాలని ఆదేశించారు. ధాన్యం మిల్లింగ్ చేసేందుకు మిల్లులను ట్యాగింగ్ చేయాలని తెలిపారు. ధాన్యం మిల్లులకు రవాణా చేసేందుకు సౌకర్యం కల్పించాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా అనుకూల స్థలాన్ని కొనుగోలు కేంద్రాలుగా ఎంచుకోవాలని సూచించారు. ధాన్యం రవాణా, ట్రాక్ షీట్ విషయంలో జాగ్రత్తలు వహించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు రకం ధాన్యం రాసులు వేర్వేరుగా నిల్వ చేయాలన్నారు. సమావేశంలో వ్యవసాయ అధికారి విజయ భాస్కర్, పౌర సరఫరాల అధికారి శ్రీకాంత్, సహకార అధికారి శైలజ, తూనికలు కొలతల అధికారి శ్రీలత పాల్గొన్నారు.

కాల్వల గండ్లను ఇసుక బస్తాలతో పూడుస్తున్న అధికారులు

కోట, శ్రీరాంపతి కాల్వల గండ్ల పూడ్చివేత

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

గోవిందరావుపేట, సెప్టెంబర్ 20 : లక్నవరం సరస్సు కింద ఉన్న ప్రధాన కాల్వలైన శ్రీరాంపతి, కోట కాల్వల గండ్లను ఎట్టకేలకు శుక్రవారం సాయంత్రం వరకు ఐబీ అధికారులు పూడ్చివేయించారు. ఈ నెలలో కురిసిన భారీ వర్షాలతో రెండు కాల్వలకు గండ్లు పడగా అధికారులు పట్టించుకోకపోవడంతో ' అధికారుల అలసత్వం.. రైతులకు శాపం' అనే శీర్షికన ఈ నెల 5న 'నమస్తే తెలంగాణ' దినపత్రంలో వచ్చిన కథనానికి ఐబీ అధికారులు స్పందించారు. గత నాలుగు రోజుల నుంచి కూలీల సహాయంతో కాలి సంచుల్లో ఇసుక నింపి గండ్లు పడిన ప్రాంతంలో పూడ్చివేయించారు.

బంగారుపల్లి గొత్తికోయ గూడెంలో అధ్యయనం

కన్నాయిగూడెం : మండలంలోని బంగారుపల్లి గొత్తికోయగూడెంలో శుక్రవారం భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) సంస్థ ప్రతినిధులతో కలిసి అదనపు కలెక్టర్ సంపత్‌రావు పర్యటించారు. ఈ సందర్భంగా గూడెంలో ఉన్న సమస్యలు, వారి జీవన విధానం, మౌలిక వసతులు, అనారోగ్య సమస్యలు, పలు అంశాలపై గొత్తికోయలను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన కంటెయినర్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. మండల ప్రత్యేక అధికారి వెంకటనారాయణ, ఎంపీడీవో అనిత, ఈజీఎస్ ఏపీవో సురేశ్ తదితరులు ఉన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం ప్రారంభం

గణపురం, సెప్టెంబర్ 20 : మండలంలోని గాంధీనగర్‌లో గండ్ర సమ్మారావు ట్రస్ట్, ప్రతిమా రిలీఫ్ హస్పిటల్ డాక్టర్ శ్యామ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని శుక్రవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఆకాంక్ష చాలా గొప్పదని, ప్రజలు తమ ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి తమ ఆరోగ్య స్థితిగతులపై టెస్టులు నిర్వహించుకోవాలన్నారు. గ్రామంలో 300 మందికి కంటి పరీక్షలు, బీపీ, షుగర్, ఈసీజీ, బ్లడ్ శాంపిల్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సొసైటీ చైర్మన్ కన్నెబోయిన కుమార్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్, నాయకులు చోటే మియా, వెంపటి భువన సుందర్, మామిండ్ల మల్లికార్జున్‌గౌడ్, బొచ్చు స్వామి, తాళ్లపెల్లి కిరణ్, నేరేళ్ల రాజు, పోశాల మహేశ్ పాల్గొన్నారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

పలిమెల, సెప్టెంబర్ 20 : మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సీఐ రాంచందర్‌రావు సూచించారు. శుక్రవారం పలిమెల పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం గోదావరి తీర ప్రాంతంలోని సర్వాయిపేట, నీలంపల్లి, దమ్మూరు, బూర్గుగూడెం, ముకునూరు ఫెర్రి పాయింట్లను తనిఖీ చేసి ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ఎస్సై తమాషారెడ్డి ఆధ్వర్యంలో ముకునూరు శివారులో కొడిపందేలు ఆడుతున్న స్థావరాలపై దాడులు నిర్వహించారు. నిందితులపై కేసులు నమోదు చేసి ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.

ఆరోగ్యశ్రీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

చిట్యాల, సెప్టెంబర్ 20 : ఆరోగ్యశ్రీ సిబ్బంది న్యాయమైన సమస్యలు, డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించి రోగుల ప్రాణాలు కాపాడాలని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలకేంద్రంలో ఏవైఎస్ మండలాధ్యక్షుడు సరిగొమ్ముల రాజేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి మల్లయ్య హాజరై మాట్లాడారు. ఆరోగ్యశ్రీ సిబ్బంది సమ్మే చేయడం వల్ల చాలా మంది సరైన సమయంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి వారి డిమాండ్లను పరిష్కరించి రోగులకు సేలందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి గుర్రపు రాజేందర్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలు జరుపాలని ఎన్నికల కమిషన్‌కు వినతి

మంగపేట, సెప్టెంబర్ 20 : షెడ్యూల్డ్-నాన్ షెడ్యూల్డ్ సమస్యపై ఏర్పడ్డ వివాదం కారణంగా మండలంలో గత 16ఏళ్లుగా నిలిచిన స్థానిక సంస్థల ఎన్నికలు తిరిగి నిర్వహించాలని కోరుతూ ఆదివాసీ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆదివాసీ అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సోడే వెంకటేశ్వర్లు శుక్రవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను కలిసి విన్నవించినట్లు ఆదివాసీ సేన డివిజన్ అధ్యక్షుడు పోలెబోయిన ఆదినారాయణ తెలిపారు. మంగపేట మండలంలోని అన్ని గ్రామాలు షెడ్యూల్డ్ ప్రాంత గ్రామాలే అని హైకోర్టు తీర్పు వెలువరించడం, ఈ తీర్పుపై సుప్రీం కోర్టు కూడా ఎలాంటి మధ్యంతర స్టే విధించని నేపథ్యంలో మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలు తిరిగి జరుపాలని కమిషన్‌ను కోరినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల కమిషన్‌ను కలిసిన వారిలో ఆదివాసీ సేన నాయకుడు వట్టం సతీశ్ ఉన్నారు.

పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన డిప్యూటీ సీఈవో

గణపురం/ కృష్ణకాలనీ/ చిట్యాల, సెప్టెంబర్ 20 : జిల్లాలోని పోలింగ్ స్టేషన్లను శుక్రవారం రాష్ట్ర ఎన్నికల సంఘం డిప్యూటీ సీఈవో హరిసింగ్ పరిశీలించారు. భూపాలపల్లి, చిట్యాల, రేగొండ, శాయంపేట, గణపురం మండలాల్లో బూత్ స్థాయి అధికారులు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ప్రక్రియను పరిశీలించారు. బీఎల్‌వో ద్వారా హెచ్‌టుహెచ్ ప్రక్రియను క్షేత్ర స్థాయిలో ధృవీకరించి సూచనలు చేశారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదాలు లేకుండా చూసుకోవాలని, మరణాలు, బదిలీలు, దిద్దుబాట్లు మొదలైన వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కుటుంబాలతో ఇంటరాక్ట్ చేయడం, బ్యాలెన్స్ వెరిఫికేషన్ పెండింగ్‌లు ఈ నెల 26 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట భూపాలపల్లి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో మంగీలాల్, భూపాలపల్లి, చిట్యాల, గణపురం తహసీల్దార్లు శ్రీనివాస్, హేమ, మధురకవి సత్యనారాణస్వామి, ఎలక్షన్ డీటీ ఇమాం బాబా, గిర్దవార్ రాజు, ఆర్ఐ రహ్మద్ పాషా, పంచాయతీ కార్యదర్శి చింతలపూడి హరిచంద్రారెడ్డి, తదితరులు ఉన్నారు.

ఓటరు నమోదును పకడ్బందీగా నిర్వహించాలి

గోవిందరావుపేట/తాడ్వాయి, సెప్టెంబర్ 20 : ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సీఈవో, డిప్యూటీ కలెక్టర్ చెన్నయ్య అన్నారు. బుస్సాపూర్, కొండపర్తిలో కొనసాగుతున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఇప్పటి వరకు అయిన ఓటరు నమోదు శాతాన్ని తహసీల్దార్లు సృజన్‌కుమార్, రవీందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్ఐ సాంబయ్య, డిప్యూటీ తహసీల్దార్ సహరాజు, ఆర్ఐ సుధాకర్ ఉన్నారు.

పోలీస్, ప్రెస్ పేరుతో బెదిరిస్తున్న ఆరుగురిపై కేసు

వాజేడు, సెప్టెంబర్ 20 : మండలంలోని జగన్నాథపురం వై జంక్షన్ వద్ద 163 జాతీయ రహదారిపై కొందరు వ్యక్తులు పోలీస్, ప్రెస్ పేరుతో వాహనదారులను బెదిరిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారు జామున 2గంటల ప్రాంతంలో డీసీఎం వ్యానును ఆపి రూ.20వేలు ఇవ్వాలంటూ బెదిరించగా వాజేడు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై హరీశ్ కథనం ప్రకారం.. అయ్యవారిపేట గ్రామం నుంచి ఏటూరునాగారం వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్‌ను కొందరు ఆపారు. అందులో వెళ్తున్న ఏటూరునాగారానికి చెందిన ఎండీ సద్దాంహుస్సేన్‌ను పోలీస్, ప్రెస్ పేరుతో బెదిరించి రూ.20 వేలు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. లేకపోతే కేసు పెడుతా, చంపుతామంటూ స్టీల్ రాడ్డు పట్టుకొని బెదిరిస్తుండగా ఏటూరునాగారం, మంగపేట గ్రామాలకు చెందిన వారిగా గుర్తించాడు. అటుగా వస్తున్న లారీలను గమణించి అరవగా నిందితులు అక్కడి నుంచి వాహనాల్లో పారిపోయారు. దీంతో బాధితుడు సద్దాం హుస్సేన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితులు పళ్ల రాంబాబు, పల్నాటి సతీశ్, వద్ది కార్తీక్, మల్లెల కమలాకర్, వావిలాల జనార్దన్, తాడూరి మధుకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బెదిరింపులకు పాల్పడిన వారిలో ఐదుగురిని అదుపులోకి తీసుకోగా ఒకరు పరారీలో ఉన్నట్లు తెలిసింది.

కాకతీయుల కట్టడాలు అద్భుతం

- దుర్గంగుట్ట, బ్లాక్‌బెర్రీని పర్యాటకంగా తీర్చిదిద్దుతాం
- కలెక్టర్ టీఎస్ దివాకర

దుర్గం గుట్టపైకి కాలినడకన వెళ్తున్న కలెక్టర్, అధికారులు

గోవిందరావుపేట/తాడ్వాయి, సెప్టెంబర్ 20 : గోవిందరావుపేట, తాడ్వాయి మండలాల్లోని దట్టమైన గుట్టపై ఉన్న కాకతీయుల భారీ రాతి కట్టడాలు అద్భుతంగా ఉన్నాయని కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం దుర్గంగుట్ట, బ్లాక్‌బెర్రీ ప్రాంతాన్ని డీఎఫ్‌వో రా హుల్ కిషన్ జాదవ్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ.. పస్రా సమీపంలోని బ్లాక్ బెర్రీ ఐలాండ్‌తోపాటు దుర్గంగుట్టను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు నివేదికలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. ములుగు జిల్లా పర్యాటక హబ్‌గా ఉన్న నేపథ్యంలో జిల్లాకు వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం ఈ ప్రాంతాల్లో సెల్ఫీ పాయింట్, దుర్గంగుట్ట చుట్టూ పై భాగంలో రేయిలింగ్, బ్లాక్ బెర్రీ ఐలాండ్‌లో పర్యాటకుల ఆటవిడుపు కోసం పలు క్రీడల నిర్వహణతోపాటు వాటి చరిత్రను పర్యాటకులకు వివరించేందుకు గైడ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. క్లాక్ టవర్‌కు వెళ్లే మార్గంలో చెక్కతో చేసిన మెట్లను అమర్చాలని అధికారులను ఆదేశించారు. అనంతరం క్లాక్ టవర్‌పై భాగం నుంచి చుట్టూ ఉన్న అటవీ అందాలను కలెక్టర్ ప్రత్యేకంగా తిలకించారు. అనంతరం కాకతీయుల భారీ రాతి కట్టడాలను పరిశీలించారు. వారి వెంట అటవీ శాఖ సిబ్బంది ఉన్నారు.

నిధులు విడుదల చేయాలని వినతి

తాడ్వాయి/ఏటూరునాగారం/ టేకుమట్ల, సెప్టెంబర్ 20 : గ్రామపంచాయతీలకు ప్రభుత్వం నిధులు విడుదలచేసేలా కృషి చేయాలని ఎంపీడీవోలు సుమనవాణి, రాజ్యలక్ష్మి, అనిత, ఎంపీవో సురేశ్‌కు ఆయా మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిధులు విడుదల కాకపోవడంతో పంచాయ తీ రోజువారీ పాలనకు కార్యదర్శుల జీతాల నుంచి ఖర్చు చేయాల్సివస్తుందని అన్నారు. త్వరలోనే బతుకమ్మ, దసరా పండగలకు ఏర్పాట్లు చేయాల్సి ఉన్నందున ప్రభుత్వం వెంటనే పంచాయతీలకు నిధులు మంజూరి చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తమ జీతాలను పెట్టి రోజువారీ కార్యకలాపాలను సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

అభివృద్ధికి చేయూత అందించాలి : కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ దివాకర

ములుగురూరల్, సెప్టెంబర్ 20 : ములుగు జిల్లా అభివృద్ధికి సహకారం అందించాలని కలెక్టర్ టీఎస్ దివాకర కోరారు. శుక్రవారం కలెక్టర్ తన చాంబర్‌లో బీహెచ్‌ఈఎల్ సంస్థ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వెంకటాపూర్ మండలంలోని నందిపహాడ్ గొత్తికోయగూడెంకు చెందిన గిరిజనులకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. వైద్య ఆరోగ్యశాఖ విషయంలో కావాల్సిన మౌలిక సదుపాయాల ప్రతిపాదనలను పంపిస్తామని, అందుకు సహకరించాలని కోరారు. అడిషనల్ కలెక్టర్ సంపత్‌రావు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మావోయిస్టుల డంప్‌తో కలకలం

- ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతుండగా లభ్యం
- పోలీసుల అదుపులో యజమాని, డ్రైవర్

తాడ్వాయి, సెప్టెంబర్ 20: మండలంలోని కాల్వపల్లిలో మావోయిస్టుల డంప్ దొరికిందనే వార్త కలకలం రేపుతున్నది. అందులో నగదు ఉందా, మందుగుండు సామగ్రి ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివరాలిలా ఉన్నాయి.. ఈ నెల 17న గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని డ్రైవర్‌తో కలిసి రాత్రి వేళలో పోడు భూమి దున్నుతుండగా ట్రాక్టర్ కల్టివేటర్‌కు ప్లాస్టిక్ డ్రమ్ము తగిలి పొగలు వస్తూ కొంచెం బయటకు వచ్చింది. గమనించిన డ్రైవర్ యజమానికి తెలుపగా ఇద్దరూ కలిసి పరిశీలించి అక్కడి నుంచి గ్రామంలోకి వచ్చి మద్యం సేవించిన అనంతరం ఎవరి ఇంటికి వారు వెళ్లిపోయారు. యజమానికి దొరికిన డంప్‌లో పెద్ద మొత్తంలో డబ్బులు ఉన్నాయని ఉదయం నుంచి ప్రచారం జరిగింది. ఈ విషయం పోలీసులకు తెలియడంతో పస్రా సీఐ రవీందర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి గురువారం యజమాని, డ్రైవర్‌తో కలిసి ఘట నా స్థలానికి వెళ్లి చూసే సరికి ఖాళీ డ్రమ్ము మాత్రమే ఉండడంతో వారిని విచారిస్తున్నారు. యజమాని మాత్రం అందులో మందుగుండు సామగ్రి ఉండడంతో భయపడి వచ్చా మంటుండగా, డ్రైవర్ మాత్రం పెద్ద మొత్తంలో డబ్బులున్నాయని చెప్తున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. విషయం వీరికి మాత్రమే తెలిస్తే తెల్లవారే సరికి అందులోని వస్తువులు ఎలా మాయమయ్యాయని, ఎవరికి సమాచారం ఇచ్చారనే విషయాలపై విచారణ చేస్తున్నారు.

డంప్‌లో ఉన్నది మందుగుండు సామగ్రేనా ?

డంప్‌లో పెద్ద మొత్తంలో మందుగుండు సామగ్రి ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మావోయిస్టులు సుమారు 10 నుంచి 15 ఏళ్ల క్రితం కాల్వపల్లి సమీపంలో డంప్‌ను ఏర్పాటు చేసి ఉంటారని, ఒకవేళ అందులో డబ్బులున్నా అది నోట్ల రద్దుతో పనికి రాకుండా పోయే అవకాశం ఉందంటున్నారు. మావోయిస్టు అగ్రనేత బడే చొక్కారావు అలియాస్ దామోదర్ సొంత గ్రామం కాల్వపల్లి కావడంతో వీళ్లలో ఎవరైనా వారికి సమాచారం ఇచ్చారా? లేక కొరియర్ల ద్వారా మందుగుండు సామగ్రిని మాయం చేశారా అనే అనుమానాలు కలుగుతున్నాయి.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

ములుగురూరల్, సెప్టెంబర్ 20 : బ్యాంకుకు వచ్చే ఖాతాదారులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని ఓఎస్డీ మహేశ్‌బాబా సాహెబ్ గీతే బ్యాంకు అధికారులకు సూచించారు. శుక్రవారం సాయంత్రం ములుగులో ఆయన బ్యాంకు అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. సైబర్ నేరాలపై సూచనలు తెలిపే వాల్ పోస్టర్లను బ్యాంకుల్లో ఏర్పాటు చేయాలన్నారు. ఖాతాదారులు సైబర్ నేరాలతో నగదు కోల్పోయి వస్తే 1930కు కాల్ చేసి ఎఫ్ఐఆర్ అనంతరం సంబంధిత ఖాతాలను సీజ్ చేయాలన్నారు. అనుమానిత ఖాతాల వివరాలను పోలీసు అధికారులకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ సందీప్‌రెడ్డి, ములుగు డీఎస్పీ రవీందర్, సీఐ యాసిన్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వాజేడు, సెప్టెంబర్ 20 : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెరుకూరు పల్లె దవాఖాన వైద్యాధికారి అజ్మీరా నవీన్‌కుమార్ అన్నారు. చెరుకూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ధరావత్ జయంతిలాల్, ఏఎన్ఎం రాజ్యలక్ష్మి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బొగ్గుల వాగు బ్రిడ్జి పరిశీలన

ములుగురూరల్, సెప్టెంబర్ 20 : అంకన్నగూడెం-సర్వాపురం గ్రామాల మధ్య ఉన్న బొగ్గులవాగు హైలెవల్ బ్రిడ్జిని సీపీఎం నాయకులు శుక్రవారం పరిశీలించారు. మండల కార్యదర్శి గఫూర్‌పాషా మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం సరైన పద్ధతిలో జరుగకపోవడంతో నీరంతా బ్రిడ్జి మీదుగా వెళ్తుందని తెలిపారు. దీంతో పంట పొలాలు మునగడంతోపాటు రహదారి దెబ్బతింటున్నట్లు ఆయన తెలిపారు. అధికారులు స్పందించి బ్రిడ్జి వద్ద తగిన ఏర్పాట్లు చేయాలని వారు కోరారు. ఆయన వెంట నాయకుడు గుండెబోయిన రవిగౌడ్ ఉన్నారు.

నేడు 16 సబ్ స్టేషన్లలో విద్యుత్ కోతలు

ములుగురూరల్, సెప్టెంబర్ 20 : ములుగు పట్టణంలోని 33కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో నేడు 16 సబ్‌స్టేషన్లలో ఉదయం 10గంటల నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ కోతలు విధిస్తున్నట్లు ఆ శాఖ డీఈ నాగేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కాసిందేవిపేట, పత్తిపల్లి, అబ్బాపురం, పందికుంట, వెంకటాపూర్, నర్సాపూర్, పస్రా, గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం, ఏటూరు, రాజుపేట, మంగపేట, వాజేడు, వెంకటాపురం(నూగూరు), ధర్మవరం విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

వెంకటాపూర్, సెప్టెంబర్ 20 : మండలంలోని జవహర్‌నగర్ గ్రామంలోని మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదర్శ పాఠశాలలో హిందీ, సివిక్స్, కామర్స్, ఫిజిక్స్ సబ్జెక్టులలో అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఈ నెల 23న పాఠశాలలో నిర్వహించే ఇంటర్వ్యూ, డెమోలకు హాజరు కావాలని తెలిపారు.

సీతారాం ఏచూరి మృతి తీరని లోటు

ఏటూరునాగారం, సెప్టెంబర్ 20 : ఎస్ఎఫ్ఐ పూర్వ జాతీయ అధ్యక్షుడు సీతారాం ఏచూరి మృతి దేశానికి తీరని లోటని ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి బీరెడ్డి సాంబశివ అన్నారు. మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ దేశం ఒక గొప్ప మేధావిని కోల్పోయిందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి, మండల కమిటీ అధ్యక్షుడు ధనుష్, సంఘం నాయకులు స్వామి, హేమాన్, నరేశ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న దేవాదుల పంపింగ్

కన్నాయిగూడెం, సెప్టెంబర్ 20 : మండలంలోని దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులోని ఫేజ్ 3లోని ఒక మోటర్‌తో గోదావరి నీటి పంపింగ్ కొనసాగుతోంది. ఒక మోటర్ ద్వారా రోజుకు 292 క్యూసెక్కుల నీటిని భీంఘనపురం రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నట్లు నీటిపారుదలశాఖ డీఈ శరత్, ఏఈఈ సాయిరాం తెలిపారు.

యువ టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేయాలి

కృష్ణ కాలనీ, సెప్టెంబర్ 20 : జిల్లాలో ఈనెల 25లోపు ఎక్కువగా యువ టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేసుకొని, వాటిని రిజిస్టర్ చేయాలని డీఈవో రాజేందర్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి చిర్ర రఘు ఆధ్వర్యంలో యువ టూరిజం క్లబ్‌ల ఏర్పాటుపై అవగాహన సదస్సును నిర్వహించగా డీఈవో హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సామాజిక సేవలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కళాశాలలు, పాఠశాలల కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్‌కు జూకల్ విద్యార్థులు

చిట్యాల, సెప్టెంబర్ 20 : రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఇద్దరు జూకల్ విద్యార్థులు ఎంపికైనారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణ శుక్రవారం తెలిపారు. వీరు ఈనెల 21, 22, 23 తేదీలలో రాజన్న సిరిసిల్లలో జరిగే పదో రాష్ట్రస్థాయి తెలంగాణ సాఫ్ట్ బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కాగా, 9వ తరగతికి చెందిన ఐశ్వర్య, 10వ తరగతికి చెందిన శనీగరపు భరత్, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికవ్వాలని ఆకాంక్షించారు.

వర్షంలోనూ ఎక్సైజ్ వాహనాల వేలం

ఏటూరునాగారం, సెప్టెంబర్ 20 : ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాల వేలం వర్షంలో కొనసాగింది. కార్యాలయం వరండాలో ఉండి సీఐ వాహనాల వేలం నిర్వహించారు. డిపాజిట్ దారులు కొందరు తడుస్తూ పాటలో పాల్గొన్నారు. మొత్తం 31వాహనాలకు సీఐ రామ కృష్ణ వేలం నిర్వహించారు. మొత్తం మీదుగా ఎక్సైజ్‌శాఖకు వాహనాల ద్వారా ఆదాయం బాగానే చేకూరింది. కాగా, కొన్ని వాహనాలను దక్కించుకునేందుకు కొందరు పాటదారులు సిండికేట్‌గా ఏర్పడ్డారు.

పీఆర్టీయూ మండల కార్యవర్గం ఎన్నిక

మహాముత్తారం, సెప్టెంబర్ 20 : మండలంలోని ములుగుపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో పీఆర్టీయూ మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భూక్యా రవినాయక్, ప్రధాన కార్యదర్శిగా అజ్మీరా రవీందర్, అసోసియేట్ అధ్యక్షుడిగా వెల్దండి హనుమంతు, మండల మహిళా ఉపాధ్యక్షురాలిగా కే గీతారెడ్డి, మండల కార్యదర్శిగా కే సతీశ్‌రెడ్డి ఏకగ్రీవమైనట్లు ఎన్నికల పరిశీలకులు కుసునపు కిరణ్‌కుమార్ తెలిపారు. జిల్లా బాధ్యులు జయమధుకర్‌రావు, కామిడి సతీశ్‌రెడ్డి, దాసరి రాజేంద్రప్రసాద్, పాపయ్య, వెంకటనారాయణ, చంద్రకళ, నాగరాజు, సుధాకర్, యాదగిరి పాల్గొన్నారు.

ఏటీడీవోగా క్షేత్రయ్య

ఏటూరునాగారం, సెప్టెంబర్ 20 : గిరిజన సంక్షేమశాఖ ఏటూరునాగారం ఏటీడీవోగా క్షేత్రయ్య బాధ్యతలు స్వీకరించారు. కొద్ది రోజులుగా ఇక్కడ ఈ పోస్టు ఖాళీగా ఉండడంతో దేశీరాం నాయక్ ఇన్‌చార్జిగా కొనసాగారు. ఆసిఫాబాద్ ఏటీడీవోగా పనిచేస్తున్న క్షేత్రయ్యను ఇక్కడకు బదిలీ చేయడంతో ఆయన ఇక్కడ విధుల్లో చేరారు. గతంలో ఆయన ఏటూరునాగారం ప్రాంతంలో పనిచేసిన అనుభవం ఉంది.

విశిష్ట పురస్కారాలకు దరఖాస్తులు

కృష్ణకాలనీ, సెప్టెంబర్ 20 : అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని వయోవృద్ధులకు విశిష్ట సేవలందిస్తున్న వయోవృద్ధుల స్వచ్ఛంద సంస్థలకు పురస్కారాలు అందజేయనున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి కే చిన్నయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అర్హులైన వారు, స్వచ్ఛంద సేవా సంస్థలు సెప్టెంబర్ 25 సాయంత్రం 5 గంటలలోపు జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత దరఖాస్తు ఫారం www.wdsc.telangana.gov.inలో ఉందన్నారు. వివరాలకు 96523 11804 నంబరును సంప్రదించాలని ఆయన సూచించారు.